నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్
5 | నిజామాబాద్, బుధవారం 14 ఫిబ్రవరి 2024 | ADILABAD

# ఐటీడీఏ పీవోగా ఖుష్బూ గుప్తా

ఉట్నూర్, ఫిబ్రవరి 13 : ఉట్నూర్ ఐటీడీఏ పీవోగా ఖుష్బూ గుప్తాను నియమిస్తూ ప్రభుత్వ సీఎంవో శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆమె సోమవారం పీవోగా క్యాంపు కార్యాలయంలో పూర్తిస్థాయి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన చాహత్ బాజ్‌పాయ్ ఆరు నెలలపాటు సెలవులపై వెళ్లారు. దీంతో మొదటగా జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఖుష్బూ గుప్తాను ఇన్‌చార్జి పీవోగా నియమించారు. అనంతరం పూర్తిస్థాయిలో బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఖుష్బూ గుప్తా మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వ పథకాలను అర్హులైన గిరిజనులకు అందించేందుకు తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.


ఉట్నూర్ ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

# ఎంపీడీవోలకు పోస్టింగ్‌లు

నిర్మల్ టౌన్, ఫిబ్రవరి 13 ః పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా వివిధ జిల్లాల నుంచి బదిలీపై వచ్చిన ఎంపీడీవోలకు మంగళవారం పోస్టింగ్‌లు కేటాయిస్తూ కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్తర్వులను జడ్పీ కార్యాలయానికి అందజేయడంతో వారు ఆయా మండలాలకు కేటాయించారు. ఆదిలాబాద్ నుంచి వచ్చిన శ్రీనివాస్‌ను కుభీర్‌కు, గజానంద్‌రావుకు నిర్మల్ రూరల్, అరుణకు కడెం, పుష్పలతకు నర్సాపూర్(జి), సురేశ్‌కు సోన్, రమాకాంత్‌కు పెంబి, సునీతకు ఖానాపూర్, అబ్దుల్ సమద్‌ను తానూరు మండలాలకు నియమించారు. రాంప్రసాద్‌కు లక్ష్మణచాంద, లక్ష్మీకాంతారావుకు సారంగాపూర్, కే.రమేశ్‌కు దస్తురాబాద్, సుశీల్‌రెడ్డికి మామడ, మంచిర్యాల జిల్లా నుంచి వచ్చిన అరుణరాణిని దిలావర్‌పూర్, నిజామాబాద్ నుంచి వచ్చిన బి.రాములుకు ముథోల్ పోస్టింగ్‌లను అందించారు. సల్మాన్‌రాజుకు లోకేశ్వరం, రహిమ్‌ను కుంటాల, సుధాకర్‌రెడ్డికి భైంసా, అశోక్‌కుమార్‌కు బాసర పోస్టింగ్‌లను కేటాయించారు. వీరంతా తక్షణం విధుల్లో చేరాలని కలెక్టర్ ఉత్తర్వులో పేర్కొన్నారు.


భక్తుల కోసం ఏర్పాటు చేసిన క్యూలైన్‌లు

# నేడే వసంత పంచమి

**వేలాదిగా తరలిరానున్న భక్తులు**

బాసర, ఫిబ్రవరి 13 : నేడు(బుధవారం) వసంత పంచమి సందర్భంగా అధికారులు ఏర్పాట్లను ఘనంగా చేశారు. భక్తులు తమ చిన్నారులకు అక్షర శ్రీకారాలు చేయించడానికి వేలాదిగా తరలిరానున్నారు. ఈ నేపథ్యంలో క్యూలైన్‌లు, అక్షరాభ్యాస టికెట్ కౌంటర్లను ఏర్పాటు చేశారు. ముథోల్ సీఐ మల్లేశ్, బాసర ఎస్సై గణేశ్‌ల ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించనున్నారు.


సరస్వతీ అమ్మవారు

# జంగ్ సైరన్

## ఉద్యమ సారథి కేసీఆర్‌కు జనం జేజేలు

**చలో నల్గొండ బహిరంగ సభను తిలకించిన ప్రజలు**

**కాంగ్రెస్ ప్రభుత్వ కుట్రలను వివరించిన బీఆర్ఎస్ అధినేత**

నిర్మల్, ఫిబ్రవరి 13(నమస్తే తెలంగాణ) : సర్జరి తర్వాత పూర్తిగా కోలుకుని మళ్లీ జనం మధ్యకు వచ్చిన బీఆర్ఎస్ అధినేత, ఉద్యమ సారథి కేసీఆర్‌కు జనం జేజేలు పలికారు. మంగళవారం సాయంత్రం నల్గొండ జిల్లా కేంద్రంలో కృష్ణా నది జలాల్లో తెలంగాణ వాటా కోసం ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభకు కేసీఆర్ హాజరు కావడంతో ఆయన ప్రసంగాన్ని వినేందుకు చాలా మంది ఆసక్తి చూపారు. బహిరంగ సభా కార్యక్రమాన్ని టీవీల్లో లైవ్ ద్వారా తిలకించారు. కేసీఆర్ సుదీర్ఘ ప్రసంగాన్ని ప్రజలు శ్రద్ధగా విని తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. కేసీఆర్ ఉద్యమ కాలం నాటి తరహాలో కృష్ణా జలాల సమస్యపై సుదీర్ఘంగా ప్రసంగించి కాంగ్రెస్ ప్రభుత్వ లోపాలను ఎత్తి చూపారని సంతోషం వ్యక్తం చేశారు. అంతేకాకుండా కొత్తగా అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధిని పట్టించుకోకుండా కేవలం ప్రజలను తప్పుదోవ పట్టించేలా బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని అప్రతిష్ఠ పాలు చేయాలన్న కుట్రతో చేస్తున్న రాద్ధాంతాన్ని విపులంగా తెలిపారు. ప్రతి అంశంపై క్షుణ్ణంగా, గణాంకాలతో కాంగ్రెస్ కుట్రలను ఎండగడుతూ చేసిన ప్రసంగం వీక్షకులను మంత్రముగ్ధులను చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏ విధంగా పాలించాలన్న అంశాన్ని కూడా వివరించారు. పెద్దన్న తరహాలో సీఎం కేసీఆర్ ప్రసంగించడంపై టీవీల్లో ఈ సభను తిలకించిన వారంతా ఆయన గొప్పతనాన్ని అభినందిండమే కాకుండా, అడుగడుగునా నీరాజనం పలికారు. నల్గొండ సభ మరోసారి కేసీఆర్‌కు ఉన్న ప్రజా బలాన్ని, అలాగే ఆయన ప్రసంగంలోని వాడీవేడీని ప్రతి ఒక్కరు గుర్తించారు.


చలో నల్లగొండ సభలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

### కాంగ్రెస్ కుట్రలను ప్రజల ముందుంచారు..



*కేఆర్ఎంబీపై కేంద్రంతో కాంగ్రెస్ ప్రభుత్వం అంతర్గతంగా చేసుకున్న ఒప్పందం బహిర్గతమైంది. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, ఇరిగేషన్ మాజీ మంత్రి హరీశ్‌రావ్‌లు వెంటనే స్పందించి కాంగ్రెస్ కుట్రలను ప్రజల ముందుంచాలన్న ఉద్దేశంతోనే ఈ రోజు నల్గొండలో భారీ బహిరంగ సభను నిర్వహించారు. ఈ సభకు భయపడే కాంగ్రెస్ నాయకులు, ముఖ్యమంత్రి హడావుడిగా కేఆర్ఎంబీకి వ్యతిరేకంగా అసెంబ్లీ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. నల్గొండలో కేసీఆర్ సభ పెట్టిన వెంటనే, ఎమ్మెల్యేలతో కలిసి మేడిగడ్డ సందర్శన అంటూ షో చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసినా నల్గొండ సభకు ప్రజల నుంచి కనీవినీ ఎరుగని రీతిలో స్పందన వచ్చింది. ప్రతి ఒక్కరు కేసీఆర్‌కు స్వాగతం పలికారు. ప్రజలు తమ హక్కులను కాపాడుకునేందుకు స్వచ్ఛందంగా తరలివచ్చారు. బహిరంగ సభలో కేసీఆర్‌ను చూడగానే ప్రజలు ఒకింత ఉద్వేగానికి లోనయ్యారు. కేసీఆర్‌పై కాంగ్రెస్ నేతలు అడ్డగోలు విమర్శలు, దూషణలకు పాల్పడడాన్ని ఎవరు కూడా తట్టుకోలేక పోతున్నారు. ఈ సభ ద్వారా కేసీఆర్ ప్రజలకు వాస్తవాలను తెలియజేయడమే కాకుండా.. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అసత్య ప్రచారాన్ని తిప్పికొట్టారు.*

**- అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, మాజీ మంత్రి.**

### ప్రజా స్పందన సూపర్



*బోథ్, ఫిబ్రవరి 13 : నల్గొండ జిల్లాలో మంగళవారం నిర్వహించిన బీఆర్ఎస్ భారీ బహిరంగ సభ విజయవంతమైంది. ప్రజలు రైతులు సమావేశానికి తరలివెళ్లారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసం ఉద్యమ బాట చేపట్టి తెలంగాణ సాధించిన కేసీఆర్‌కు జనం జై కొట్టారు. కృష్ణ నీటి వాటాలో మనకు రాకుండా కాంగ్రెస్ ప్రభుత్వం అప్పనంగా ప్రాజెక్టును కేంద్రానికి అప్పజెప్పిందని రైతులకు అర్థమయ్యే రీతిలో విపులంగా వివరించారు. ప్రాజెక్టు అప్పగిస్తే వాటిపై మనం పూర్తిగా హక్కు కోల్పోవాల్సి వస్తుందని తెలిపారు. తెలంగాణకు ఏ నష్టం జరిగినా ప్రాణత్యాగానికి సిద్ధమని కేసీఆర్ నిండుసభలో ప్రకటించడంతో జనం పెద్ద ఎత్తున జేజేలు పలికారు. నల్గొండ సభతో కాంగ్రెస్ పార్టీలో వణుకు మొదలైందన్నారు.*

**- జాదవ్ అనిల్ కుమార్, ఎమ్మెల్యే, బోథ్.**

### మరో ఉద్యమానికి శ్రీకారం



*ఆసిఫాబాద్, ఫిబ్రవరి 13 : కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ సాక్షిగా కృష్ణా జలాల పంపిణీ విషయపై అబద్ధాలు చెబుతూ ప్రజలను పక్కదోవ పట్టిస్తున్నది. కృష్ణా జలాల పంపిణీ చట్ట ప్రకారమే జరిగింది. కేసీఆర్ సర్కారులో నీళ్లకోసం ఆంధ్ర ప్రభుత్వంతో ఎన్నోసార్లు గొడవ జరిగిన విషయం ప్రజలందరికీ తెలుసు. కృష్ణ బేసిన్‌పై పోలీస్ పహారా మధ్య నీటి విడుదల చేసిన సందర్భాలు ఉన్నాయి. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయడం చేతగాక నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నది. అందుకే బీఆర్ఎస్ అధినేత నీళ్లకోసం మరో ఉద్యమానికి శ్రీకారం చుట్టారు.*

**- కోవ లక్ష్మి, ఎమ్మెల్యే, ఆసిఫాబాద్.**

# ది స్టోరీ ఆఫ్ యాపల్ గూడ చిల్డ్రన్స్

- ఇంగ్లిష్‌లో కథలు రాసిన ఐదో తరగతి విద్యార్థులు
- 18 మంది విద్యార్థులు రాసిన కథలను బుక్‌గా మలచిన ఉపాధ్యాయుడు


విద్యార్థులతో ప్రధానోపాధ్యాయుడు గంగయ్య

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 13 : బాల సాహిత్యం అనేది కష్టమైన పని. పెద్ద పెద్ద రచయితలు కూడా బాలసాహిత్యం రాయడాన్ని ఒక సాహసంగా చెప్తారు. బడి పిల్లలు కథ, రచనపై అభిరుచి కలిగి ఉన్నారని తెలుసుకుని, ఓ ఉపాధ్యాయుడు వారిని ప్రోత్సహించి వారిలోని సృజనాత్మకతను వెలికితీశారు. ఫలితంగా అద్భుతమైన కథలు వచ్చాయి. ఆదిలాబాద్ రూరల్ మండలంలోని యాపల్ గూడ ప్రభుత్వ పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న కొంత మంది విద్యార్థులు సాహిత్యంపై ఆసక్తి చూపుతున్నారని ఉపాధ్యాయుడు బుక్ గంగయ్య తెలుసుకున్నాడు. ఆ ఉపాధ్యాయుడు పిల్లలకు చదువు చెప్తూనే.. కథా రచనలపై అవగాహన కల్పించారు. ఆయా సామాజిక అంశాలను కథలుగా ఎలా రాయవచ్చో వివరించాడు. దీంతో 18 మంది విద్యార్థులు ఇంగ్లిష్‌లో ఒక్కో కథ రాశారు. ఈ కథలన్నిటినీ ఒక పుస్తకంగా ముద్రించాడు. దీనికి 'ది స్టోరీ ఆఫ్ యాపల్ గూడ చిల్డ్రన్' అని పేరు పెట్టాడు. ఇదిలా ఉంటే ఈనెల 11న హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ గార్డెన్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి పుస్తక ప్రదర్శనలో ప్రదర్శించారని హెచ్ఎం గంగయ్య తెలిపారు. పిల్లలే కథలు రాయడంపై జిల్లా కవులు, రచయితలు హర్షం వ్యక్తం చేశారు.


మాజీ సర్పంచ్‌లను సన్మానిస్తున్న బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న

# మోసకారి రేవంత్‌రెడ్డి

- రైతులకు రుణమాఫీ చేస్తామని చేయలేదు..
- కేసీఆర్ సర్కారు హయాంలోనే అభివృద్ధి జరిగింది..
- మాజీ సర్పంచ్‌ల సన్మాన కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రామన్న

ఎదులాపురం, ఫిబ్రవరి 13 : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి మోసం చేశారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో పదవీకాలం పూర్తి చేసుకున్న పార్టీ సర్పంచ్‌లకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ గ్రామాల సర్పంచ్‌లకు రామన్న శాలువాలు కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా రామన్న మాట్లాడుతూ.. బీఆర్ఎస్‌కు సహనం లేదని, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని దించేస్తామని ప్రకటనలు చేస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీలు రమేశ్, గోవర్ధన్, డీసీసీబీ డైరెక్టర్ పరమేశ్వర్, మాజీ ఏఎంసీ చైర్మన్ మెట్టు ప్రహ్లాద్, సీనియర్ నాయకులు రోకండ్ల రమేశ్, కుమ్ర రాజు, లింగారెడ్డి, సాజీదొద్దీన్, గంభీర్ ఠాక్రె, సతీశ్ పవర్, రాజన్న, మాజీ సర్పంచ్‌లు పెందూర్ గంగారం, విలాస్, భూమన్న, విఠల్, ఇందుబాయి ఉన్నారు.

# పారదర్శకంగా పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ

**నిర్మల్ కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్**


ఈవీఎంలను తనిఖీ చేస్తున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

నిర్మల్ టౌన్, ఫిబ్రవరి 13 : పార్లమెంట్ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు నిర్మల్ కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. కలెక్టరేట్ సమీకృత భవనంలోని ఈవీఎం గోదాముల్లో నిల్వ ఉంచిన ఈవీఎం యంత్రాలు, వీవీ ప్యాట్స్‌లో మొదటి లెవల్ తనిఖీ పూర్తయిన సందర్భంగా మాక్ పోలింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎలక్ట్రానిక్ మిషన్, ఈవీఎంలను సిద్ధంగా ఉంచడం జరిగిందన్నారు. 4,134 ఈవీఎం మిషన్లు, 1,596 బ్యాలెట్ యూనిట్లు, 1,199 కంట్రోల్ యూనిట్స్, 1,339 వీవీ ప్యాట్స్ మొదటి దశలో పరిశీలన పూర్తయిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు కిశోర్‌కుమార్, ఫైజన్‌అహ్మద్, ఆర్డీవో రత్నకల్యాణి, రాజకీయ పార్టీల నాయకులు రమేశ్, రవి, శ్రావణ్‌రెడ్డి, మజర్, ఎన్నికల అధికారులు సాహో, శ్రీనివాస్ పాల్గొన్నారు.

# నాగోబా జనసంద్రం

## కేస్లాపూర్‌కు పోటెత్తిన భక్తజనం

- సంప్రదాయబద్ధంగా మండగాజిలింగ్ పూజలు
- బేతాల్ దేవతకు మొక్కులు
- శ్యాంపూర్‌కు బయలుదేరిన మెస్రం వంశీయులు

ఇంద్రవెల్లి, ఫిబ్రవరి 13 ః ఆదివాసీ గిరిజనుల ఆరాధ్యదైవం కేస్లాపూర్ నాగోబాను దర్శించుకోవడానికి ఆయా ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలి వస్తున్నారు. ఉమ్మడి జిల్లాతోపాటు వివిధ రాష్ట్రాల నుంచి భారీ సంఖ్యలో రావడంతో పరిసర ప్రాంతాలు కిక్కిరిసి పోయాయి. దర్శనం కోసం గంటల కొద్దీ బారులుతీరారు. దారిపొడువునా వెలిసిన దుకాణాలు, రంగుల రాట్నాలు, హోటళ్లు, తినుబండారాల షాప్స్ వద్ద సందడి కనిపించింది. ఎటు చూసినా భక్తులు జాతరకు తరలివస్తూ కనిపించారు.

### సంప్రదాయబద్ధంగా మండగాజిలింగ్ పూజలు

నాగోబా ఆలయ ఆవరణలో మెస్రం వంశీయుల ఆధ్వర్యంలో మండగాజిలింగ్ పూజలను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ముందుగా నాగోబాతోపాటు సతీదేవతలకు భక్తులు వేసిన కానుకల(పావుడి డబ్బులు)ను పటేల్ కిత్త, కటోడ కిత్త, పర్ధాంజీ కిత్తలవారీగా డబ్బులను పంచుకున్నారు. అనంతరం ప్రసాదంతోపాటు కొబ్బరికాయలు, ప్రమిదలు, మట్టికుండలను మెస్రం వంశీయులతోపాటు వారి దగ్గరి బంధువులకు పంపిణీ చేశారు. మహాపూజలకు వాడిన మట్టి కుండలను కూడా 22 కితలకు చెందిన వారికి పంపిణీ చేశారు.

### బేతాల్ దేవతకు పూజలు

బేతాల్‌దేవతకు సంప్రదాయబద్ధంగా ప్రత్యేక పూజలు చేశారు. మెస్రం వంశీయుల పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్‌పటేల్ కాగడాలను వెలిగించి, బేతాల్ పూజలను ప్రారంభించారు. బేతాల్ దేవత పేరిట సంప్రదాయ పద్ధతిలో నేలపై తంబాకు వేసి అక్కడి నుంచి నాగోబాను మొక్కుకున్నారు. అనంతరం సంప్రదాయ వాయిద్యాలు వాయిస్తూ నృత్యాలు చేస్తూ గోవాడ్‌కు చేరుకున్నారు. గోవాడ్ పక్కన పటేల్ గది ఏర్పాటు చేసి, బేతాల్‌దేవత పూజలపై మెస్రం వంశీయులతోపాటు మహిళలకు వేర్వేరుగా పర్ధాంజీ మెస్రం దాదారావ్, నాగోబా పేన్ కొత్వాల్ మెస్రం తిరుపతి వివరించారు. గోవాడ్ ఎదుట మెస్రం వంశీయుల మహిళల ఆధ్వర్యంలో మెస్రం వంశీయుల పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్‌పటేల్ చేతి కర్రతోపాటు పెద్దల పాదాలను నీటితో కడిగారు. మహిళలు, మెస్రం వంశీయులు వేర్వేరుగా మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. మహిళలు, పురుషులు వేర్వేరుగా బేతాల్ నృత్యాలు చేశారు. తరువాత మెస్రం వంశీయులు అక్కడి నుంచి నాగోబాను దర్శించుకొని నాగోబా పూజలతోపాటు సంప్రదాయ పూజలకు ముగింపు పలికారు. సాయంత్రం కేస్లాపూర్ నుంచి కుటుంబ సమేతంగా ఎడ్లబండ్లతో ఉట్నూర్ మండలంలోని శ్యామ్‌పూర్ గ్రామంలోని భుడుందేవు జాతర పూజల కోసం బయలుదేరారు. ఈ కార్యక్రమంలో మెస్రం వంశీయుల పీఠాధిపతి వెంకట్‌రావ్‌పటేల్, చిన్ను పటేల్, బాజీరావ్, లింబారావ్ పటేల్, కటోడ కోసు, కటోడ కోసేరావ్, కటోడ హనుమంత్‌రావ్, నాయిక్‌వాడి ధర్ము, పర్ధాంజీ మెస్రం దాదారావ్, నాగోబా పేన్ కొత్వాల్ తిరుపతి, మెస్రం వంశీయులు గణపతి, దేవ్‌రావ్, శేఖర్‌బాబు, రాము, గంగారాం పాల్గొన్నారు.


ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని కేస్లాపూర్ నాగోబా జాతరకు తరలివస్తున్న ప్రజలు


బేతాల్ ముగింపు పూజలు చేస్తున్న మెస్రం వంశీయులు


బేతాల్ నృత్యం చేస్తున్న మెస్రం వంశీయుల పీఠాధిపతి వెంకట్‌రావ్‌పటేల్


సతీక్‌దేవత వద్ద భక్తులు వేసిన ప్యాలాలను కితలవారీగా పంచుతూ..


సంప్రదాయ నృత్యాలు చేస్తున్న మహిళలు


నేలపై తంబాకు వేసి గోవాడ్ ప్రాంతం నుంచి నాగోబాకు పూజలు చేస్తున్న మెస్రం వంశీయులు


పూజలందుకుంటున్న నాగోబా విగ్రహం


కేస్లాపూర్ నాగోబా ఆలయం నుంచి శ్యాంపూర్‌కు వెళ్తున్న మెస్రం వంశీయులు